సాక్షి
అనంతపురం
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16,500

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500, కనిష్ట ధర రూ.8 వేలు పలికాయి.



టమాట కిలో రూ.19

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.19, కనిష్ట ధర రూ.10 పలికింది.



జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

20 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో 2.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. విడపనకల్లు 11.8 మి.మీ, గుత్తి 10.8 మి.మీతో పాటు మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 84 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకు 303.4 మి.మీకి గానూ 9.6 శాతం అధికంగా 332.5 మి.మీ నమోదైంది. ఈ సీజన్‌లో 28 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. 11 మండలాల్లో సాధారణం కన్నా అధికంగానూ, 17 మండలాల్లో సాధారణం, మిగతా మూడు మండలాల్లో తక్కువగా వర్షాలు కురిశాయి. ఆదివారం కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

పయ్యావుల ఇలాకాలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 21 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఉరవకొండ/ ఉరవకొండ రూరల్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత ఇలాకాలో భారీ పేకాట స్థావరంపై ఉరవకొండ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. 21 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. పయ్యావుల సొంత పంచాయతీ అయిన ఉరవకొండ మండలం పెద్దకొకుంట్ల పరిధిలోని మైలారంపల్లి వద్ద వ్యవసాయ క్షేత్రంలో భారీఎత్తున పేకాట స్థావరం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రాత్రి వ్యవసాయ క్షేత్రాన్ని చుట్టుముట్టారు. 21 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.77 వేల నగదు, 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను స్టేషన్‌కు తరలించి..కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ చేస్తున్నామని, నిర్వాహకులు ఎవరన్నది విచారణలో తేలాల్సి ఉందని సీఐ మహనంది తెలిపారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



ఆర్డీఓకు నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

బుక్కరాయసముద్రం: ఎంపీపీ సునీతపై వైఎస్సార్ సీపీ మద్దతుదారులు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కేశవ నాయుడుకు 12 మంది ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు నోటీసు అందజేశారు. మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వైఎస్సార్ సీపీ సభ్యులు 13 మంది ఉన్నారు. వైఎస్సార్ సీపీ గుర్తుతో గెలిచి టీడీపీలోకి చేరిన ఎంపీపీ సునీతపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 13 మంది ఎంపీటీసీలు నిర్ణయించుకుని నోటీసును ఆర్డీఓకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, నామాల శిరీష, బుల్లే సుజాత, వడ్డే రాజ్యలక్ష్మి, భాస్కర్ రెడ్డి, రాం గోపాల్, ఎర్రినాగప్ప, అంజినరెడ్డి, సాకే జయలక్ష్మి, శివారెడ్డి, కుళ్లాయప్ప, రామచంద్ర, నాగయ్య తోపాటు జెడ్పీటీసీ భాస్కర్, చికెన్ నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియజేయాలని సూచించారు. అర్జీతో పాటు ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే రసీదు తీసుకురావాలని సూచించారు.

తొలగని కష్టాలు



అనంతపురం డీసీఎంఎస్ వద్ద పోలీసు నిఘాలో యూరియా పంపిణీ



అనంతపురం డీసీఎంఎస్ కార్యాలయంలో యూరియా టోకెన్ల కోసం రైతుల అవస్థ

- యూరియా కోసం పరుగులు
- ఎక్కడుందంటే అక్కడ పడిగాపులు
- డీసీఎంఎస్ వద్ద పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: రైతన్నలకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. నెలన్నర రోజులుగా పరుగులు పెడుతూ.. పడిగాపులు కాస్తున్నా రెండు బస్తాల యూరియా దొరకని పరిస్థితి. అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా ఫలానా చోట యూరియా ఉందని తెలిస్తే చాలు అక్కడికి పరుగులు పెడుతున్నారు. రోజంతా ఎదురుచూస్తే కానీ యూరియా దొరకడం లేదు. దాని కోసం ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం చూపడంతో పాటు బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది. ఎక్కడికక్కడ యూరియా అందుబాటులో ఉంచామని వ్యవసాయశాఖ చెబుతోంది. జిల్లాలో ప్రస్తుతం నాలుగు వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా సిద్ధంగా ఉందని, ఇందులో బఫర్‌స్టాక్ కింద వెయ్యి టన్నులు మార్క్‌ఫెడ్ వద్ద ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ చాలా పరిమితంగా, అది కూడా కొన్ని ప్రాంతాల్లోనే లభిస్తోంది. రైతు సేవ కేంద్రాలు (ఆర్‌ఎస్‌కేలు), సహకార సొసైటీలు, డీసీఎంఎస్, ఎఫ్‌పీవోలు, రీటైల్ దుకాణాల్లో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు కొనసాగుతున్నాయి.

డీసీఎంఎస్‌కు తరలివచ్చిన రైతులు

కొన్ని రోజులుగా యూరియా అమ్మకాలు ఆపేసిన అనంతపురం డీసీఎంఎస్ అధికారులు ఎట్టకేలకు శుక్రవారం రాత్రి మూడు లారీల్లో 36 మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించారు. విషయం తెలుసుకున్న పరిసర మండలాల రైతులు శనివారం వందలాది మంది డీసీఎంఎస్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పరిస్థితి ఇబ్బంది అవుతుందనే ఆలోచనతో అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించారు. రెండు బస్తాల యూరియాతో పాటు అర లీటర్ నానో యూరియా తీసుకోవాలని మెలికపెట్టారు.

పక్కదారి పట్టడంతోనే సమస్య

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో లక్ష హెక్టార్లలో కంది, 89 వేల హెక్టార్లలో వేరుశనగ, 23 వేల హెక్టార్లలో వరి, 26 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 12 వేల హెక్టార్లలో అరటి సాగు చేశారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఈ పంటలకు యూరియా అవసరం ఏర్పడింది. కానీ కూటమి సర్కారు, జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ తగినంత యూరియా అందుబాటులో పెట్టడంలో విఫలం కావడంతో కొరత తీవ్రస్థాయికి చేరుకుంది. ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వచ్చిన యూరియా చాలా వరకు పక్కదారి పట్టింది. దీంతో కీలక సమయంలో యూరియా కొరత ఏర్పడింది. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్, రీటైల్ దుకాణదారులు కొందరు ఎంఆర్‌పీకి మించి బస్తా రూ.400 పైచిలుకు అమ్ముతూనే..వాటికి తోడుగా అవసరం లేని మరికొన్ని ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ మందులు అంటగడుతూ రైతులపై భారం మోపుతున్నారు.

'తమ్ముళ్ల' పెత్తనం

యూరియా పంపిణీ సందర్భంగా ఆర్‌ఎస్‌కే సిబ్బందిపై 'తెలుగు తమ్ముళ్లు' పెత్తనం చెలాయిస్తున్నారు. తాము చెప్పినట్లుగా నడుచుకోవాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. గ్రామ, మండల స్థాయి చోటామోటా నేతలు హల్‌చల్ చేస్తూ ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఫలితంగా వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏ, ఎంపీఈఓలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. యూరియా పంపిణీ అనగానే ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లలో వణుకు పుడుతోంది. యూరియా సమస్య నుంచి పైస్థాయి ఏఈవోలు, ఏవోలు, ఏడీఏలు గట్టెక్కుతున్నా.. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఇచ్చిన తర్వాతే ఇతరులకు ఇవ్వాలని కొన్ని చోట్ల ఒత్తిడి తెస్తుండగా... మరికొన్ని చోట్ల చోటామోటా నేతలే దగ్గరుండి టోకెన్లు పంచుతున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు ఏకంగా తమ గోడౌన్లలోనే యూరియా దింపుకుంటున్నారు. సచివాలయం, ఆర్‌ఎస్‌కే తాళాలు కూడా తమ దగ్గరే ఉంచుకుని ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లను ఇక్కట్లలోకి నెట్టేస్తున్నారు. ఇటీవల కణేకల్లు, బొమ్మనహాళ్, గార్లదిన్నె తదితర మండలాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. 'పచ్చ' నేతల ఆగడాలను నివారించని పైస్థాయి అధికారులు కేవలం ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లను టార్గెట్ చేస్తున్నారు. మొత్తమ్మీద యూరియా కొరత అటు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, ఇటు సాధారణ రైతులను సమస్యల్లోకి నెట్టేస్తోంది.

కార్యకర్తలకు అండగా ఉండేందుకే

డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ నాయకులు

- ఇబ్బంది పెట్టే వారి వివరాలను అందులో నమోదు చేస్తాం
- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో అనంత
- బాలకృష్ణ ఓ ఉన్మాదని మండిపాటు

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పరాకాష్టకు చేరాయి. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కక్ష సాధింపు చర్యలు ఊపందుకున్నాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కార్యకర్తలకు అండగా ఉంటానని, అన్యాయం చేసిన ఎవరినీ వదలబోనని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారని' వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో డిజిటల్ బుక్కును ఆయన ఆవిష్కరించారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ సవీంద్రారెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసిన పోలీసులపై హైకోర్టు మండిపడడమే కాకుండా కేసును సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలిచ్చిందని, ఇంత వరకు దేశంలో ఎక్కడా ఇటువంటి పరిస్థితిని చూడలేదని అనంత అన్నారు.

వెబ్‌సైట్‌లో నమోదు చేస్తాం

అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులపై భవిష్యత్తులో చర్యలు తప్పవని అనంత హెచ్చరించారు. పాలకుల ఆదేశాలతో వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టేలా చట్టాలను అతిక్రమించి వ్యవహరిస్తే భవిష్యత్తులో ఎక్కడున్నా వదిలిపెట్టబోమన్నారు. బాధితులు ఎవరైనా తమ ఇబ్బందులను డీబీ.డబ్ల్యూఈవైఎస్ఆర్‌సీపీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చన్నారు. 040-49171718 నంబర్‌కు కాల్ చేసి కూడా తెలపవచ్చునన్నారు. ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రాల్లో, 29న మండల స్థాయిలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఉన్మాది అని, అతనికి మతిస్థిమితం లేదని, వైఎస్ జగన్, చిరంజీవిలపై చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. అతని పేరు ఇప్పటికే డిజిటల్ బుక్‌లో నమోదైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, హిందూపురం పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎం మోహన్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థ నాయక్, రాష్ట్ర నాయకులు పెన్నోబులేసు, వెన్నం శివరామిరెడ్డి, కృష్ణవేణి, బాబా సలాం, జానీ, ఎగ్గుల శ్రీనివాసులు, రంగంపేట గోపాల్‌రెడ్డి, మీసాల రంగన్న, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, శ్రీనివాసులు నాయక్, మల్లెమీద నరసింహులు, వైపీ బాబు, చంద్రశేఖర్ యాదవ్, అమర్‌నాథ్‌రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయకులు దాదు, నాగార్జున్ రెడ్డి, చింతకుంట మధు, కేశవ రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, సాకే కుళ్లాయస్వామి, సాకే చంద్రలేఖ, ఉష, తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న మహిళా నేతలు

పనుల్లో పురోగతి లేకపోతే ఉపేక్షించేది లేదు



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలూ నాయక్

అనంతపురం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రహదారులు, బ్రిడ్జిలు, భవనాల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, లేకపోతే ఉపేక్షించేది లేదని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) బాలూ నాయక్ హెచ్చరించారు. స్థానిక ఆ శాఖ రాయలసీమ సర్కిల్ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. పీఎంజీఎస్‌వై కింద చేపట్టిన తారు రోడ్లు, బ్రిడ్జిలు, నాబార్డు కింద చేపట్టిన రోడ్లు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టి అర్ధంతరంగా ఆగిన హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలపై ఈఎన్‌సీ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ కింద కొత్తగా పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, ఒక్కో పంచాయతీ భవనానికి రూ.32 లక్షల చొప్పున కేటాయించినట్లు వివరించారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాణ్యత వంద శాతం పాటించాల్సిందేనని, లేకపోతే కాంట్రాక్టర్లతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్ష్యాల కేటాయింపులో వెనుకబడిన ఇంజినీర్లు పని తీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ బండారు మురళీ, కర్నూలు ఎస్ఈ వేణుగోపాల్, ఈఈలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాములు, శంకరయ్య, క్యూసీ ఈఈ మల్లికార్జున మూర్తి, ఆదోని ఈఈ రామకృష్ణ, డీఈఈలు కె.లక్ష్మీనారాయణ, జింకల కృష్ణజ్యోతి, గుత్తి మురళీధర్, ఎస్ఈ పీఏ రాజేంద్రప్రసాద్ సహా 4 జిల్లాల పీఆర్, పీఆర్ఐ, పీఐయూ, క్వాలిటీ కంట్రోల్ డీఈఈలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పరిశీలన

పెద్దవడుగూరు మండలం చిత్తూరు–పామిడి మార్గంలోని వంకపై పీఎంజీఎస్‌వై–3 కింద రూ.16.75 కోట్లతో నిర్మించతలపెట్టిన బ్రిడ్జి నిర్మాణాన్ని ఈఎన్‌సీ శనివారం పరిశీలించారు. నిబంధనల మేరకు బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దని ఆదేశించారు.

నెలాఖరులోపు ఖాళీ చేయండి

- జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు కోర్టు ఆదేశం

అనంతపురం టౌన్: స్థానిక స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రామ్‌నగర్ కార్యాలయాన్ని ఈ నెలాఖరులోపు ఖాళీ చేయాలని కోర్టు ఆదేశించింది. కొన్ని నెలలుగా అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో భవన యజమాని న్యాయస్థానం మెట్లెక్కారు. దీంతో భవనాన్ని ఖాళీ చేయాలని ఈ ఏడాది జనవరిలో జిల్లా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అయితే, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కోర్టును ఆశ్రయించి కొంత సమయమివ్వాలని కోరడంతో 6 నెలలు గడువు ఇచ్చారు. అయినా కార్యాలయాన్ని ఖాళీ చేయకపోవడంతో ఇటీవల మరో మారు భవన యజమాని కోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం ఈ సారి ధిక్కార ఆదేశాలు జారీ చేసింది. నెలాఖరులోపు ఖాళీ చేయాల్సిందేనని హెచ్చరించింది. ఈ విషయంపై జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌ను వివరణ కోరగా ఆయన స్పందించారు. భవనాన్ని ఖాళీ చేయాలని ఇప్పటికే పలుమార్లు నోటీసులు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. కొత్త భవనం కోసం ప్రకటనలు ఇచ్చినా భవన యజమానులు ముందుకు రాలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాగా, ప్రభుత్వ ఖజానాకు జిల్లాలోనే అధిక ఆదాయాన్ని సమకూర్చే శాఖకే భవనం దొరక్కపోవడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



అనంతపురం పాతూరు అమ్మవారి శాలలో గజలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

శక్తిస్వరూపిణీ పాహిమాం

దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలతో జిల్లా ఆధ్యాత్మిక శోభతో కాంతులీనుతోంది. రోజుకో అలంకరణలో దర్శనమిస్తున్న జగన్మాతను దర్శించుకునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరుతున్నారు. శనివారం జిల్లాలోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. శక్తిస్వరూపిణీ పాహిమాం అంటూ అమ్మవారిని వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

ఓఎంసీలో అటవీశాఖ అధికారుల తనిఖీలు



ఓఎంసీలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

డీ హీరేహాళ్ (రాయదుర్గం): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో అటవీశాఖ అధికారులు తనిఖీలకు శ్రీకారం చుట్టారు. శనివారం జిల్లా ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ చక్రపాణి ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజర్ రామచంద్రుడు, డీఆర్‌ఓ దామోదర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఓఎంసీ ప్రాంతంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. 2011లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజం, వాహనాల స్క్రాబ్ వివరాలపై డీఎఫ్‌ఓ ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీబీఐ సీజ్ చేసిన ఐరన్ ఓర్‌ను కొందరు అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. అయితే ఇక్కడ అలాంటిదేమీ కానరాలేదన్నారు. ఒకటి, రెండు ట్రిప్పులు మాత్రమే తరలివెళ్లినట్టు గుర్తించామన్నారు. పెద్ద ఎత్తున దోపిడీ జరిగిన ఆనవాళ్లు కనిపించడం లేదన్నారు. ఓఎంసీ ప్రాంతంలో పటిష్ట నిఘా ఉంచామన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

కళ్యాణదుర్గం రూరల్/రాయదుర్గం టౌన్/కణేకల్లు: సాగు చేసిన పంటలను రైతులు తప్పని సరిగా నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాయదుర్గం డివిజన్ పరిధిలోని మండలాల్లో ఈ- పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రైతుల పొలాల్లోకి వెళ్లి ఏ పంటలైతే సాగు చేశారో వాటి వివరాలే నమోదు చేయాలన్నారు. యూరియాపై రైతులెవరూ ఆందోళన చెందొద్దని, డిమాండ్‌కు సరిపడా యూరియా పంపిణీ చేస్తామన్నారు. 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పెండింగ్ రైతుల వివరాలను పూర్తి చేయాలన్నారు. ఆర్‌ఎస్‌కేల సిబ్బంది రైతులతో మమేకమై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లప్ప, ఏఓ శ్రావణ్ కుమార్, రాణి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పకళ.. భళా

తాతల నుంచి అబ్బిన కళను ఆయన కొనసాగిస్తున్నారు. విగ్రహాలకు ప్రాణం పోస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటకలోని ప్రాంతాల వారు సైతం వచ్చి విగ్రహాలు తయారు చేయించుకుని తీసుకెళ్తున్నారు. ఇటీవల అమెరికాకు సైతం ఆయన ఖ్యాతి పాకింది. ఆయన రూపొందించిన అమ్మవారి విగ్రహాన్ని ఆ దేశంలోని ఓ ఆలయంలో ప్రతిష్ఠించారు. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే మరింత మందికి ఉపాధి కల్పిస్తామంటున్న గుంతకల్లువాసి వీరభద్రాచారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



తాను రూపొందించిన వినాయక విగ్రహంతో వీరభద్రాచారి



కుటుంబ సభ్యులతో కలిసి పంచలోహ విగ్రహాలకు మెరుగులు దిద్దుతున్న దృశ్యం

- విగ్రహాల తయారీలో పేరుగాంచిన గుంతకల్లు వాసి
- ఇతర రాష్ట్రాల నుంచీ ఆర్డర్లు
- అమెరికాకు సైతం పాకిన వీరభద్రాచారి ఖ్యాతి
- సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆ దేశ ఆలయంలో ప్రతిష్ఠించిన వైనం
- ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరుతున్న కుటుంబం





వీరభద్రాచారి తయారు చేసిన సీతారామ సహిత లక్ష్మణ విగ్రహాలు,వేంకటేశ్వర స్వామి పాదాలు

గుంతకల్లు: వీరభద్రాచారి స్వగ్రామం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని జోహరాపురం గ్రామం. అయితే, చాలారోజుల క్రితమే గుంతకల్లుకు వచ్చి తిలక్‌నగర్ మదీనామసీదు వీధిలో స్థిరపడ్డారు. వీరభద్రాచారి తాతల కాలం నుంచే పంచలోహ విగ్రహాలు తయారు చేస్తున్నారు. దీంతో చిన్నప్పటి నుంచే ఆ వైపు మక్కువ పెంచుకున్న ఆయన నేడు విగ్రహాల తయారీలో సిద్ధహస్తుడిగా పేరుగాంచారు.

నెలల తరబడి శ్రమ..

వీరభద్రాచారి 1/4 కిలోల నుంచి 50 కిలోల వరకూ పంచలోహ విగ్రహాలు తయారు చేస్తుంటారు. పంచలోహ విగ్రహాల తయారీ వెనుక నెలల తరబడి కష్టం దాగి ఉంటుంది. ఒక విగ్రహాన్ని తయారు చేయాలంటే ఆషామాషీ విషయం కాదంటారు వీరభద్రాచారి. ముందుగా మూసలో ఆకారం తయారు చేయాల్సి ఉంటుంది. లక్క, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వాటిని రూపొందించాలి. అనంతరం పంచలోహాలను కరగబెట్టి మూసలో పోసి బాగా ఆరనిచ్చాక జాగ్రత్తగా మూస నుంచి విడగొట్టాలి. ఈ ప్రక్రియలో ఏ కొద్ది లోపం జరిగినా మొదటికే మోసం వస్తుంది. శ్రమంతా వృథా అవుతుంది. లోహం కూడా నాణ్యత కోల్పోతుంది. దీంతో భారీగా నష్టపోవాల్సి వస్తుంది. భక్తిశ్రద్ధలతో పాటు క్రమశిక్షణతో తయారు చేస్తేనే స్పష్టమైన ఆకారం వస్తుందని చెబుతున్నారు వీరభద్రాచారి. ఆంజనేయస్వామి, శివపార్వతులు, షిర్డీ సాయి, సీతారాములు విగ్రహాలతో పాటు మకర, ద్వారతోరణాలు, గదలు, కిరీటాలు, ఏనుగు, గుర్రాల విగ్రహాలను ఈయన తయారు చేస్తారు. ఉత్సవ వాహనాలు, ప్రముఖుల ముఖ రూపాలనూ రూపొందిస్తారు.

విభిన్న ప్రాంతాల నుంచి..

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి సైతం విగ్రహాలు తయారు చేయించుకునేందుకు వీరభద్రాచారి వద్దకు వస్తుంటారు. ఇటీవల అమెరికాకు చెందిన వారి ఆర్డర్‌పై సరస్వతీ దేవీ విగ్రహాన్ని వీరభద్రాచారి రూపొందించారు. ఆయన తయారు చేసిన విగ్రహాన్ని ఆ దేశంలోని దేవాలయంలో ప్రతిష్ఠించడం గమనార్హం. వీరభద్రాచారికి విగ్రహాల తయారీలో భార్య శాలినీతో పాటు ఆయన తండ్రి శ్రీనివాసాచార్యులు చేదుడోవాదోడుగా ఉంటున్నారు.

ఆదరణ తగ్గుతోంది

పంచలోహ విగ్రహాలు తయారు చేసే వృత్తికి ఆదరణ తగ్గుతోంది. ఉచితంగా శిక్షణ, భోజన సదుపాయంతోపాటు వసతి కల్పిస్తామన్నా ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో పని ఒత్తిడి పెరిగిపోయింది.

– వీరభద్రాచారి, శిల్పి, గుంతకల్లు

ప్రభుత్వం ఆదుకోవాలి

విశ్వకర్మ యోజన పథకం కింద ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. విగ్రహాల తయారీకి వినియోగించే మిషనరీ, పరికరాలు, ఇతర వస్తువులను సబ్సిడీపై ఇవ్వడంతో ఉచితంగా కరెంటు సౌకర్యం కల్పించాలి.

– శ్రీనివాసాచార్యులు, శిల్పి, గుంతకల్లు

పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లండి

- మొదటి రోజు తీసుకోలేని వారికి కలెక్టర్ సూచన

అనంతపురం క్రైం: పింఛన్‌ను అక్టోబరు 1న తీసుకోలేని వారు 3వ తేదీన సచివాలయాలకు వెళ్లి తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 2,79, 933 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.124.77 కోట్లు విడుదల చేసిందన్నారు. అక్టోబరు 2న గాంధీ జయంతి ఉండటంతో పింఛన్ పంపిణీ ఉండదన్నారు. తిరిగి మూడో తేదీన పంపిణీ చేస్తారని, ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము పొందాలని సూచించారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

అనంతపురం అర్బన్: ఈవీఎంల భద్రతా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాములను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేనిదే గోదాముల్లోకి ఎవరినీ అనుమతించకూడదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ కేశవ నాయుడు, కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బెళుగుప్ప: కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని నక్కలపల్లిలో శనివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన రామ్మోహన్, వెన్నపూసల సుజాత (49) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. సుజాత ఇటీవల కడుపు నొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. కడుపునొప్పి అధికం కావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో చీనీ చెట్లకు కొట్టే పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా.. చికిత్స ఫలించక మృతి చెందింది. దీనిపై బెళుగుప్ప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'పీపీపీ'తో పేదలకు వైద్యవిద్య దూరం



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

అనంతపురం అర్బన్: పేదలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని న్యాయవాదులు మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పద్ధతి (పీపీపీ)లో నిర్వహించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆనంద్‌ను శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో న్యాయవాదులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం న్యాయవాదులు గాజుల ఉమాపతి, ఆర్. హరినాథరెడ్డి, ఈ.వెంకటరాముడు, గౌనినాగన్న, బాకే హబీబుల్లా తదితరులు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలలను మంజూరు తీసుకొచ్చారన్నారు. కళాశాలలకు ప్రభుత్వ భూమి, నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టారన్నారు. అందులో ఐదు కళాశాలలు ప్రారంభమయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటితో పాటు ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణమూ జరుగుతోందన్నారు. వీటి ద్వారా ఏటా 1,500 మంది విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించే అవకాశం లభిస్తుందన్నారు. 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు అతి తక్కువ ఖర్చుతో వైద్య విద్య అభ్యసించవచ్చన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికీ మెరుగైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించుకుంటూ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తోందన్నారు. సర్కారు నిర్ణయంతో వైద్య కళాశాలలతో పాటు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళతాయని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.నాగరాజబాబు, టీఆర్ నారపరెడ్డి, టి.నరసింహారెడ్డి, కె.విద్యాపతి, సయ్యద్ షాహి, ఇ.లక్ష్మీకాంత, టీఎం రాఘవేంద్ర, సూర్యచంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విషపురుగు కాటుకు వ్యక్తి మృతి

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన జింకల కొండయ్య (55) విషపురుగు కాటుకు గురై మృతి చెందాడు. వివరాలు.. శనివారం కొండయ్య తమ గ్రామ సమీపంలోని కొండలోకి కట్టెలు కొట్టుకొచ్చేందుకు వెళ్లాడు. తన కాలిని ఏదో కరిచిందంటూ ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి వెళ్లేలోపే విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కొండయ్యకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

సతీష్ రెడ్డి మృతి కేసులో ఇద్దరి అరెస్టు

పామిడి: మండలంలోని జీ కొట్టాల గ్రామవాసి, వైఎస్సార్‌సీపీ రూరల్ బూత్ కన్వీనర్ల ప్రెసిడెంట్ దేవన సతీష్‌రెడ్డి మృతి కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. సతీష్ రెడ్డి ఈ నెల 24న బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. రోడ్డు ప్రమాదం కారణంగానే సతీష్ రెడ్డి మృతి చెందాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలోనే ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ మండ్ల సాయికుమార్ (దేవరపల్లి), ట్రాక్టర్ ఓనర్ కుళ్లాయప్పను అరెస్టు చేసి శనివారం గుత్తి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి ఇరువురిని రిమాండ్‌కు ఆదేశించడంతో గుత్తి సబ్ జైలుకు తరలించారు.

ఐక్యతతోనే బీసీలకు ఫలాలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

- కులగణనతోనే బీసీల అభ్యున్నతి
- మాజీ ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం టవర్‌క్లాక్: ఐక్యతతోనే బీసీలకు ఫలాలు అందుతాయని మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ తలారి రంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, మాజీ మేయర్ రాగే పరశురామ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ బీసీలు అత్యధిక జనాభా ఉన్నా ఎన్నో ఏళ్లుగా వెనుకబడిపోతున్నారన్నారు. హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్ల కోసం అడుక్కోవడానికే పరిమితమయ్యామని, ఇలాగే భయపడుతూ ఉంటే మరింత వెనుకబాటు తప్పదన్నారు. అన్ని రంగాల్లోనూ అభ్యున్నతి సాధించి అందరికీ ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో కుల గణన చేయడం ద్వారా బీసీలు అభివృద్ధి చెందారన్నారు. గతంలో తాను మున్సిపల్ కమిషనరుగా ఉన్నప్పుడు కులగణనపై నివేదిక కూడా పంపినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా బీసీల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు కులగణన చేపడతామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బీసీల జపం చేసి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచేవరకు ఉద్యమాలు కొనసాగించాలన్నారు. ఇందుకు బీసీ ప్రజా ప్రతినిధులు అండగా నిలవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు బాల రంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, ఇమామ్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, బీఎస్పీ నాయకులు గోవిందు, ఆర్‌పీఎస్ నాయకులు శ్రీరాములు. శివబాల, లింగమూర్తి, బోరంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ, చంద్రబాబు కార్మిక వ్యతిరేకులు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ధ్వజం



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కార్మిక వ్యతిరేకులని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ధ్వజమెత్తారు. సీఐటీయూ జిల్లా మహాసభలు శనివారం నగరంలో ప్రారంభమయ్యాయి. ముందుగా ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి నగర పాలక సంస్థ వరకు ర్యాలీ నిర్వహించారు. సీతారాం ఏచూరి ప్రాంగణం (స్థానిక ఫంక్షన్ హాలు)లో సీఐటీయూ జెండాను సీనియర్ నాయకుడు ఏజీ రాజమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సీఐటీయూ ఆఫీసు బేరర్లు నాగమణి, నాగరాజు, శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభకు నరసింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం చంద్రబాబు దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. పీ-4తో పేదరికం లేకుండా చేస్తానంటూ మరింత పేదరికంలోకి నెట్టేసే విధానాలు అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. పెట్టుబడిదారీ విధానాలు అమలు చేస్తూ శ్రమదోపిడీకి సిద్ధమయ్యాయని మండిపడ్డారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని దుమ్మెత్తిపోశారు. రాష్ట్రంలో 10 గంటల పని విధానంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కూటమి ప్రభుత్వం కార్మిక ద్రోహిగా మారిందని మండిపడ్డారు. బ్రిటిష్ పాలకులు కూడా నిత్యావసర సరుకులపై సుంకాలు వేయలేదని, కానీ మోదీ ప్రభుత్వం నిత్యావసరాలపైనా పన్నులు విధించిందని విమర్శించారు.8 గంటల పని విధానం, కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటు ఉచిత విద్య, వైద్యం అమలు, హక్కుల పరిరక్షణకు ఉద్యమాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, నాయకులు బాలరంగయ్య, లింగమయ్య, ఆర్‌వీనాయుడు, గోపాల్, ముత్తూజా, వెంకటనారాయణ, రామాంజినేయులు, రమాదేవి, శకుంతల, నాగభూషణ, జగన్‌మోహన్, శివప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, సాకేనాగరాజు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్‌టీ'పై అవగాహన కల్పించండి

అనంతపురం అర్బన్: 'సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్'పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీఎస్‌టీ అంశంపై కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. దీనిపై అక్టోబరు 19 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్ వల్లి, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు, డ్వామా పీడీ సలీంబాషా, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై 'పచ్చ'పాతం

- డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేయని వైనం

యాడికి: అధికార పార్టీ నాయకులు, డీలర్లు వైఎస్సార్‌సీపీ నాయకులపై 'పచ్చ'పాతం చూపుతున్నారు. డిజిటల్ రేషన్ కార్డులు అందించకుండా వేధిస్తున్నారు. దీనిపై బాధితులు సచివాలయ సిబ్బందిని ఆశ్రయించినా ఫలితం లేక పోయింది. వివరాలు.. యాడికి మండలంలోని వెంగన్నపల్లిలో ఇటీవల ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్లు ఇంటింటికీ పంపిణీ చేపట్టారు. అయితే గ్రామంలో దాదాపు 30 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు మాత్రం కార్డులు అందించకుండా వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయంపై పలు మార్లు బాధితులు స్థానిక సచివాలయం వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసినా ఏ మాత్రమూ పట్టించుకోలేదు. దీంతో శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధితులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంగన్నపల్లి ఎంపీటీసీ పుట్లూరు జయప్రద, పుట్లూరు సరస్వతి, పుట్లూరు ఉమాదేవి, పుట్లూరు చిన్న వెంకట రెడ్డి, నంద్యాల రాములమ్మ, గుత్తి పంపిరెడ్డి, లక్ష్మిరంగా రెడ్డి, రమేష్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, సూరి, నరసింహులు, తిరుమలేశ్వర రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం

- సచివాలయ ఉద్యోగుల మండిపాటు



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బైఠాయించిన సచివాలయ ఉద్యోగులు

అనంతపురం మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మండిపడ్డారు. శనివారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ, జెడ్పీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు వారు వినతి పత్రాలు అందించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన 3 నెలల నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలల అరియర్స్, పదోన్నతులు, మాతృశాఖ ప్రకారం జాబ్‌చార్ట్, ఆరేళ్లు పూర్తయిన ఉద్యోగికి ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం మంజూరు తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందిగా ఉన్న డోర్ టూ డోర్ సర్వేలకు స్వస్తి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, మల్లికార్జున, చంద్ర, వరప్రసాద్, లక్ష్మీనారాయణ, హనుమంతు, ముత్యాలు, మంజునాథ్, మృదుల, శంకర్ రెడ్డి, విద్యాసాగర్, నరేష్, చిన్నవన్నూరప్ప, కిషోర్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపర్తిలో అదృశ్యం.. బళ్లారిలో ప్రత్యక్షం

రాప్తాడు: గాండ్లపర్తిలో అదృశ్యమైన తల్లీపిల్లలు బళ్లారిలో ప్రత్యక్ష్యమయ్యారు. వివరాలు.. మండలంలోని గాండ్లపర్తి గ్రామానికి చెందిన సాకే పోతులయ్య భార్య పద్మలత తన మూడేళ్ల కుమార్తె భానుశ్రీ, 8 నెలల కుమార్తె బేబీతో కలిసి ఈ నెల 23న అదృశ్యమైంది. దీనిపై పోతులయ్య ఫిర్యాదు మేరకు సీఐ టీవీ శ్రీహర్ష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో గాలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాల దగ్గర గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే బళ్లారిలో తల్లీకుమార్తెల ఆచూకీ లభ్యం కావడంతో వెళ్లి తీసుకొచ్చారు. శనివారం వారిని తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టిన అనంతరం భర్త సాకే పోతులయ్యకు అప్పగించారు. పోలీసులను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

చదువుతోనే ఉజ్వల భవిత



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలస్వామి

అనంతపురం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అనంతపురం మున్సిపల్ కమిషనర్ బాలస్వామి అన్నారు. శనివారం పీవీకేకే డిప్లొమా కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి హాజరైన కమిషనర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం పట్ల గౌరవం కలిగివుండాలన్నారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్, ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం మరో పాలికేక

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని, లేనిపక్షంలో మరో పాలికేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అఖిల పక్ష కమిటీ నాయకులు బీసీఆర్ దాస్ హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సేవ్ ఆర్డీటీ అఖిల పక్ష కమిటీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీఆర్ దాస్ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు అండగా నిలుస్తున్న ఆర్డీటీకి నిధులు రాకుండా నిలిపివేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి 15 రోజుల సమయం ఇస్తున్నామని, అంతలోపు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషణ మహాపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అనంతపురం రూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటేనే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. అనంతపురం రూరల్–5 సెక్టార్ పరిధిలోని సుఖదేవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రాష్ట్రీయ పోషణ మహా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఏహెచ్‌పీ వాణి, అంగన్‌వాడీ వర్కర్లు రేణుక, సుజాత, రామాంజులమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

రాప్తాడు: వృత్తి విద్య కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగ్గా లభిస్తాయని రాప్తాడు జెడ్పీ హైస్కూల్ వృత్తి విద్యా శిక్షకురాలు సంకె మౌనిక తెలిపారు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం రాప్తాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మల్లికార్జున సెల్ ఫోన్ రిపేరీ షాపులో సెల్‌ఫోన్ రిపేరీ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వృత్తి విద్యా శిక్షకురాలు మాట్లాడుతూ శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

స్కేటింగ్‌లో సత్తా



చిన్నారి అమీనాతాజ్‌ను అభినందిస్తున్న కోచ్‌లు

అనంతపురం: నగరంలోని రాంనగర్‌లో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. 6–8 సంవత్సరాల కేటగిరీలో నిర్వహించిన రింగ్ వన్ రింగ్ పోటీల్లో ఎక్కలూరు అమీనాతాజ్ రెండు బంగారు పతకాలు సాధించి సత్తా చాటింది. అమీనా తాజ్ ప్రస్తుతం నగరంలోని శ్రీ చైతన్య పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది.

వెండి కిరీటం బహూకరణ



స్వామివారికి వెండి కిరీటం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీనివాస నగర్‌లో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి భక్తులు వెండి కిరీటం బహూకరించారు. నగరానికి చెందిన కుక్కి విజయలక్ష్మి దంపతులు రూ.1.50 లక్షల విలువైన కిరీటం అందించగా, ఆలయ కమిటీ సభ్యులు చక్రధార, ఇతర అలంకరణ సామగ్రిని స్వామివారికి చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శంకరయ్య, బళ్లారి వెంకటరాముడు, కోనేటి సాయిప్రసాద్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. వచ్చేనెల ఒకటిన శ్రీవారి కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ప్రాణాలతో చెలగాటం

- ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపని ఆర్టీసీ
- ప్రజలకు తప్పని తిప్పలు
- ప్రమాదమని తెలిసినా ప్రయాణం



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో అవస్థలు పడుతున్న ప్రయాణికులు



పుట్‌బోర్డుపై ప్రమాదకర ప్రయాణం..



బస్సు ఎక్కేందుకు అగచాట్లు



సీటు కోసం పరుగులు



గమ్యం చేరాలంటే తప్పదుగా..

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులకు చుక్కలు కనబడుతున్నాయి. పుట్ బోర్డులపైనా కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. కండక్టర్లు, డ్రైవర్లు ఎంత చెప్పినా ఫలితం లేకపోతోంది. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తల్లుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. బస్సుల్లో సీట్ల కోసం ఒకరితో ఒకరు పోట్లాటకు దిగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోక పోవడంతో ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండి పడ్డారు.

బస్సులు పెంచక పోవడంతో సమస్య

తగినన్ని బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు చెప్పనలవిగా మారాయి. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని బస్సులు సంఖ్యను పెంచాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా సామాన్య ప్రయాణికుడికి గమ్యస్థానం చేరడం కష్టంగా మారింది.

చాలా రూట్లలో అంతర్రాష్ట్ర సర్వీసులు

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను 'స్త్రీశక్తి' కింద ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ వినియోగిస్తోంది. అయితే, చాలా ఎక్స్‌ప్రెస్‌లను ఆర్టీసీ అధికారులు ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. అంతర్రాష్ట్ర సరీ్వసు పేరుతో నడిచే చాలా బస్సులు ఆంధ్రా నుంచి కర్ణాటకలోని ఒకటి, రెండు పల్లెలకు చివరిగా వెళ్లేవే ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఉచితం కాదని బోర్డులు పెట్టడంతో ఆయా ప్రాంతాల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి మండలం పేరూరు గ్రామానికి వెళ్లే బస్సులు కర్ణాటక సరిహద్దులో 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న, తిరుమణి, బీకే హళ్లికి వెళతాయి. పేరూరు దాకా ప్రయాణికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించే అవకాశం ఉంది. అయితే, అధికారులు అవకాశం కల్పించ లేదు. ఈ రూటు నిత్యం రద్దీగా ఉండేది కావడంతో ప్రయాణానికి చుక్కలు కనబడుతున్నాయి.

పట్టించుకోని ఆర్టీసీ జోనల్ చైర్మన్..

ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా ఆర్టీసీ సేవలందిస్తుందని ఇటీవల ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కడప ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు జాడే కానరావడం లేదు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నా కనీసం ప్రత్యేక సిబ్బంది, మైకు లాంటి ఏర్పాట్లు చేసి ప్రయాణికులను సర్దిచెప్పాలన్న స్పృహ చైర్మన్‌తో పాటు సంబంధిత అధికారులకు లేకపోవడం చాలా దారుణమని ప్రయాణికులు మండిపడుతున్నారు. కలెక్టర్ ఆనంద్ అయినా ప్రయాణికుల కష్టాలపై స్పందించాలని కోరుతున్నారు.

డ్రగ్స్ వద్దు.. క్రీడలు ముద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

అనంతపురం: యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచి, క్రీడల వైపు దృష్టి మళ్లించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా డీఎస్పీ మహబూబ్‌బాషా సూచించారు. దిశా పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం 'స్టాప్ డ్రగ్స్– స్టార్ట్ స్పోర్ట్స్' పోస్టర్‌ను డీఎస్పీ ఆవిష్కరించారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచడం కోసం అవగాహన కార్యక్రమాన్ని ఏఐవైఎఫ్ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ యువత జీవితాలను నాశనం చేస్తాయన్నారు. సమాజ భవిష్యత్తు అయిన యువత క్రీడలు, విద్య, సృజనాత్మకత వైపు దృష్టి సారించాలన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, నాయకులు ఆనంద్, శ్రీనివాస్, రాంబాబు, అశోక్ సింహ పాల్గొన్నారు.

'కియా' సిబ్బందికి తప్పిన ప్రమాదం

కనగానపల్లి: దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో 'కియా' సిబ్బందికి ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... 'కియా' పరిశ్రమలో పనిచేస్తున్న 25 మంది శనివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని అనంతపురానికి బస్సులో వెళ్తున్నారు. దాదులూరు సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్ ముందుకు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి వాహనంపై అదుపు కోల్పోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టిం డివైడర్‌పైకి ఎక్కి నిలబడిపోయింది. దీంతో 'కియా' ఉద్యోగులు సురక్షితంగా బయటపడ్డారు. ఒకవేళ బస్సు బోల్తా కట్టి ఉంటే పెనుప్రమాదమే జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

నేడు నగరానికి సుకృతానంద

అనంతపురం కల్చరల్: అనంతలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న శ్రీ రామకృష్ణ విశ్వజనీన దేవాలయ పర్యవేక్షణ కోసం రామకృష్ణ మిషన్ నుంచి స్వామి సుకృతానంద మహారాజ్ ఆదివారం నగరానికి విచ్చేస్తున్నారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సాగే సమావేశంలో స్వామీజీ పాల్గొని మార్గదర్శనం చేస్తారని సమితి కార్యదర్శి శ్రీధరమూర్తి, ప్రవీణ్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం–తాటిచెర్ల రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి 60 ఏళ్లు ఉండవచ్చన్నారు. మృతదేహం వద్ద వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు మాచారం అందించాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో దళిత బిడ్డలకు నష్టం

- ప్రభుత్వ తీరుపై ఈ నెల 30న నిరసన
- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు

అనంతపురం కార్పొరేషన్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో దళిత బిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు అన్నారు. శనివారం ఆయన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీనవర్గాల పిల్లలు వైద్య విద్యనభ్యసించాలని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో వీటిని ప్రైవేటీకరణ చేస్తూ జీఓ విడుదల చేశారన్నారు. ప్రైవేట్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించాలంటే ఐదేళ్లలో రూ.2 కోట్లు అవుతుందన్నారు. నిరుపేదలకు ఇదెలా సాధ్యపడుతుందో చెప్పాలన్నారు. కూటమి నేతల జేబులు నింపేందుకే ప్రభుత్వం ఇటువంటి దుర్మార్గానికి ఒడిగట్టిందని విమర్శించారు. ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేందుకు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నగరంలోని జెడ్పీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఎస్సీ సంఘం నాయకులు, దళితులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఎస్సీ సెల్ నాయకులు ఎగ్గుల శ్రీనివాసులు, లబ్బే రాఘవ, సాకే కుళ్లాయస్వామి, పసలూరు ఓబులేసు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ షన్ముఖకుమార్

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న వాటర్ షెడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐడబ్ల్యూఎంపీ డైరెక్టర్ షన్ముఖకుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా డ్వామా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 ప్రాజెక్టుల పరిధిలో 848 పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చెక్‌డ్యాం నిర్మాణ పనులతోపాటు నీటి కుంట పనులను వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. 10 రోజులకోకసారి వాటర్ షెడ్ పనులపై సమీక్ష నిర్వహించాలని డ్వామా పీడీలను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీం బాష, ఏపీడీ కృష్ణ చైతన్యతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మేలుకున్న డీఎంహెచ్‌ఓ

- అమ్మ ఆస్పత్రికి అలా వెళ్లి.. ఇలా వచ్చేసిన భ్రమరాంబదేవి



అమ్మ ఆస్పత్రిలో బోర్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి మేలుకున్నారు. శనివారం నగరంలోని 'అమ్మ' ఆస్పత్రిని తనిఖీ చేశారు. అమ్మ, హృదయ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే బిడ్డను పోగొట్టుకున్నామంటూ ఈ నెల 27న రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారు జామున 3 గంటల వరకు నగరంలోని హనుమాన్ కాలనీకి చెందిన శిరీష, జయసింహ దంపతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కూడా చర్చనీయాంశమైంది. కానీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భ్రమరాంబ దేవి పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే, శనివారం రాత్రి కుంటితుడుపుగా అమ్మ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. అది కూడా అలా వెళ్లి ఇలా వచ్చేశారు. అనంతరం ఘటనపై విచారణకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

ఏడాది పొడవునా పప్పుశనగ సాగు

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి సిద్ధ సాగు పద్ధతుల్లో (న్యాచురల్ ఫార్మింగ్) ఏడాది పొడవునా నల్లరేగడి భూముల్లో పప్పుశనగ పండించడానికి అవకాశం ఉందని చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) లక్ష్మానాయక్ తెలిపారు. స్థానిక ప్రకృతి వ్యవసాయం (డీపీఎంయూ) కార్యాలయంలో అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, ప్రకాశం, నంద్యాల, కర్నూల, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 40 మంది న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బందికి మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీటీఐఓ మాట్లాడుతూ పప్పుశనగతో పాటు ఏ–గ్రేడు కింద ఆవాలు, నువ్వులు, కంది, ఆముదం, అనుములు, వంగ లాంటి పంటలను వేసుకోవచ్చన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి, మదిగుబ్బ సచివాలయాల పరిధిలోని రైతులకు శనివారం అధికారులు యూరియా పంపిణీ చేశారు. రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులపై రెండు రోజులుగా 'సాక్షి' వరుసగా కథనాలు ప్రచురించింది. దీంతో వ్యవసాయ అధికారులు స్పందించి తోపుదుర్తికి 12.6 టన్నులు, పి.యాలేరుకు 12.6 టన్నుల యూరియాను కేటాయించారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం రైతులకు యూరియాను అందజేశారు.

తల్లిదండ్రులు దైవంతో సమానం

అనంతపురం కల్చరల్: తల్లిదండ్రులను గౌరవించుకోవడమంటే సాక్షాత్తు భగవంతున్ని కొలుచుకోవడంతో సమానమేనని వక్తలన్నారు. ఓం సంగీత నృత్యకోలాట శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మాతృపూజలు ఘనంగా జరిగాయి. ఈ తరం పిల్లలకు విలువలతో కూడిన జీవనవిధానం, సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయడానికి ఏటా నిర్వహించే మాతృపూజలను ఈసారి ఘనంగా జరిపించామని నిర్వాహకులు దేవరకొండ కౌసల్య అన్నారు. పెద్దలను, గురువులను దైవ సమానంగా చూస్తే సమాజంలో ఎటువంటి కలతలు ఉండవన్నారు. అంతకు ముందు చిన్నారులతో తల్లులకు పాద పూజ చేయించి ఆశీర్వాదాలందించారు. కార్యక్రమంలో పంచరత్నం శంకర నారాయణ శర్మ, నరేంద్ర, వినీత్, వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



నూతన విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

రాప్తాడు: జి.కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు భక్త జన సందోహం మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

హనుమద్ వాహనంపై శ్రీవారి విహారం

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తులను ఆనంద పరవశులను చేస్తున్నాయి. అధిక సంఖ్యలో తరలి వస్తున్న భక్తజనం గోవింద నామస్మరణతో శ్రీనివాసనగర్, రామనగర్, హౌసింగుబోర్డులని శ్రీ వేంకటేశ్వరాలయాలు ప్రతిధ్వనిస్తున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నవగ్రహ హోమం, దీక్షా హోమం శాస్త్రోక్తంగా సాగాయి. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరుడు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఆయుధ పూజ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో శనివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు హాజరై.. దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

నూతన హెచ్‌ఎంలకు శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల పదోన్నతులు పొందిన 135 మంది ప్రధానోపాధ్యాయులకు హెచ్‌ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ప్రారంభించారు. హెచ్‌ఎంల విధులకు సంబంధించిన రూల్స్, రెగ్యులేషన్స్ గురించి ముఖ్య అతిథులుగా హాజరైన డీఈఓ ప్రసాద్‌బాబు, డీవైఈఓలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ ముక్కర హరినాథ్, గౌరవాధ్యక్షుడు బాలమురళీకృష్ణ, నాయకులు జె.మదన్ మోహన్‌రెడ్డి, డి.రోషన్, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

రాప్తాడు: జీఎస్టీ తగ్గినందున వస్తువులు, ఆహార పదార్థాల కొనుగోలు చేసే సమయంలో వాటి ధరలు తప్పక పరిశీలించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది కిరాణా దుకాణాలు దగ్గర జీఎస్టీ తగ్గడం వల్ల కలిగిన ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... కొత్త జీఎస్టీ రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. పాత రేట్లతోనే ఎవరైనా వస్తువులు విక్రయిస్తే ప్రశ్నించాలన్నారు.

శిల్పారామంలో నేటి నుంచి దసరా వేడుకలు

అనంతపురం రూరల్: నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం నుంచి అక్టోబర్ రెండు వరకు దసరా వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఏఓ శివప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అక్టోబర్ ఒకటిన క్లాసికల్, జానపద నృత్య ప్రదర్శనలు, రెండో తేదీన భరత నాట్య ప్రదర్శన ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.30 వరకు కార్యక్రమాలు జరుగుతాయని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ఆత్మకూరు: మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ పరిశీలించారు. ఆత్మకూరు సమీపంలో కూలీలు పనులు చేస్తున్న ప్రాంతానికి వెళ్లిన అసిస్టెంట్ కలెక్టర్..కూలీలతో మాట్లాడారు. అధికారులు పనులు కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం ఆయన ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పండ్ల తోటల పెంపకం, పశువుల షెడ్లు, రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, నీటి తొట్టెల నిర్మాణాలను పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంట డ్వామా పీడీ సలీం బాషా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగకృష్ణయ్య, ఏపీఓ వెంకటరమణ ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

నేడు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు శ్రీకాశీ విశ్వేశ్వరాలయం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఆదివారం జరగనుంది. నూతన చైర్మన్‌గా నరేంద్ర చౌదరి, ఇతర కార్యవర్గ సభ్యులు ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో బాధ్యతలు స్వీకరిస్తారని ఈవో నాగేంద్రుడు తెలిపారు.

నయనానందకరం .. జగన్మాత దర్శనం

అనంతపురం కల్చరల్: శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణగా భక్తులను అనుగ్రహించారు. వాడవాడలో భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యంగా కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. హెచ్చెల్సీ కాలనీలోని ననకోట ముత్యాలమ్మ పార్వతీదేవిగా, పాతూరులోని శ్రీరేణుకా యల్లమ్మ తల్లి నవధాన్యాల అలంకరణలో, కొల్హాపూర్ మహాలక్ష్మి లలితా త్రిపుర సుందరిగా, తపోవనంలో వేదమాత గాయత్రి లలితాదేవిగా, షిరిడీసాయిబాబా మందిరంలో కనకదుర్గగా దర్శనమిచ్చారు. శ్రీశివబాలయోగి ఆశ్రమంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చిన అనంతేశ్వరిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో శారదామాత శేషవాహనంపై నారసింహ అలంకారంలో పూజలందుకుంది. మారుతీనగర్ రామాలయం, శివకోటి, శంకరమఠం, చౌడేశ్వరి, చాముండేశ్వరీ ఆలయాలలో జగన్మాత విభిన్నరూపాలలో దర్శనమిచ్చారు. సుభాష్‌రోడ్డులో అర్బన్‌బ్యాంకు ఎదురుగా కొలువుదీరిన శ్రీలలితా త్రిపుర సుందరీదేవిని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



కొత్తూరు అమ్మవారిశాలలో వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న వాసవీమాత

గుండెకు అండగా ఉందాం

ఈ ఏడాది 'వరల్డ్ హార్ట్ డే' థీమ్ 'ఒక్క స్పందననూ మిస్ కాకండి' (డోంట్ మిస్ ఏ బీట్) అని. అంటే... గుండెను రక్షించుకోవడంలో ఏ అవకాశాన్నీ వదులుకోవద్దనీ, గుండె ఇచ్చే వార్నింగ్ సిగ్నల్స్‌గానీ లేదా అదే చేసే హెచ్చరికలుగానీ ఏవీ మిస్ కాకుండా చూసుకోవాలనే సందేశాన్ని ఈ థీమ్ ఇస్తోంది. ఈ నేపథ్యంలో గుండె సంరక్షణ కోసం సీనియర్ కార్డియాలజిస్టులు... పాఠకులతో పంచుకుంటున్న అత్యంత కీలకమైన విషయాలివి.

భారతదేశంలో గుండెజబ్బుల విస్తృతి కాస్తంత బెంబేలెత్తించేలాగే ఉంది. గతంలో అంటురోగాల శకం ముగిసి, ఇప్పుడు జీవనశైలితో వస్తున్న 'నాన్ కమ్యూనికబుల్ జబ్బులు' విస్తరిస్తున్న శకంలో... అన్ని జబ్బులతో పోలిస్తే గుండెజబ్బుల వాటా తక్కువేమీ కాదు. పైగా అన్ని నదులూ పరుగెత్తేది సముద్రం వైపే అన్నట్టుగా... అన్ని జబ్బులూ నడిచేది గుండెజబ్బుల వైపే. ఉదాహరణకు అది డయాబెటిస్‌గానీ, హైబీపీగానీ, స్థూలకాయం, మెటబాలిక్ సిండ్రోమ్స్ ఇవన్నీ పెరుగుతూ పెరుగుతూ చివర్న గుండెజబ్బుల దిశగా పయనిస్తున్నాయి. ఇక్కడ పేర్కొన్న ప్రతి జబ్బూ అది హార్ట్ ఎటాక్‌గానో, బ్రెయిన్ స్ట్రోక్‌గానో పరిణమించేదే అనడంలో సందేహం లేదు.

■ హృద్రోగం వృద్ధాప్య రోగం కాదు...

గతంలో గుండెజబ్బులనేవి కాస్తంత వయసు పెరిగాకే కనిపించేవి. ఇప్పుడు అవి కూడా చాలా త్వరితంగా వచ్చేస్తున్నాయి. ప్రత్యేకించి యువతలో సైతం కనిపిస్తున్నాయి. అందుకే చాలా సందర్భాల్లో వీటిని నిశ్శబ్ద ఉత్పాతాలు (సైలెంట్ ఎపిడెమిక్స్) అని కూడా నిపుణులు పేర్కొంటున్నారు.

■ ఆ తెలుగు వాడుక మాట అక్షరాలా నిజం...

మన తెలుగు వాడుక మాటల్లో 'గుండెల్ని పిండేసేలాగా...' అన్నది ఓ జాతీయం. ఒత్తిడి విషయంలో ఆ నుడికారం అక్షరసత్యం. ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ అది 'గుండెలను పిండేస్తుంది'!

మానసిక ఒత్తిడి అనేది ఓ భావోద్వేగపూరితమైన ఎమోషన్‌గా చెప్పడం సరికాదు. ఆ భావోద్వేగం కాస్తా తన భౌతిక లక్షణాలతో గుండెజబ్బుగానో, గుండెపోటుగానో కనిపించడం చాలా సాధారణం. ఎందుకంటే... మానసిక ఒత్తిడి పెరగగానే... రక్తనాళాల్లో రక్తపోటూ పెరుగుతుంది. రక్తపోటు కాస్తా గుండెపోటుగా పరిణమించడం మనకు తెలిసిన విషయమే. మనం సంప్రదాయంగా పాటించే కొన్ని అంశాల్లో దీనికి విరుగుడు దాగుంది. అవే... యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు. వీటి సాయంతో మన నరాలను హాయిపరచడం మొదలుపెట్టగానే... రక్తనాళాల్లో పోటెత్తే రక్తప్రవాహాన్ని అది జోకొడుతుంది. దాంతో బీపీ తన నార్మల్ ఒత్తిడికి వచ్చేస్తుంది. ఫలితంగా గుండెజబ్బుల ముప్పూ తప్పుతుంది. అందుకే ఇప్పుడు డాక్టర్లు కూడా మందులతో పాటు... ఈ మార్గాలూ ప్రిస్క్రిప్షన్‌లో సూచిస్తున్నారు.

■ డాన్సులూ డేంజరస్‌గా మారిన డేస్ ఇవి!

ఇప్పుడు న్యూస్ ఫాలో అవుతున్నవారికి తెలియని విషయాలేమీ కావివి. అవేమిటంటే... మంచి వయసులో ఉన్న యువత కూడా డాన్స్ చేస్తూనో, క్రికెట్ ఆడుతూ ఆడుతూనో, జిమ్‌లో వ్యాయమం చేస్తూనో యువతీ యువకులు కుప్పకూలిపోతున్నారు. దీన్ని నివారించదగిన అంశాలూ ఉన్నాయి. ఉదాహరణకు ఎక్కువ శక్తిని ఒకేసారి ఇచ్చే హై-ఎనర్జీ డ్రింకులూ, వ్యాయామంతోపాటు స్టెరాయిడ్స్ తీసుకుంటున్న ఉదంతాలూ, ఒకే చోట కూర్చుని చేసే వృత్తివ్యాపకాలూ, చురుగ్గా కదలడానికి అంతగా ఇష్టపడని జీవనశైలీ... ఇవన్నీ ఇలా ఆకస్మికంగా గుప్పెడంత గుండెను కుప్పకూల్చే ముప్పును పెంచుతున్నాయి. వీటి నివారణ చాలా సింపుల్. క్రమం తప్పకుండా చేసుకునే కొన్ని సాధారణ ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలతో పెద్ద పెద్ద గుండె ముప్పులనూ నివారించుకోవచ్చు. అలా నిబ్బరంగా, నిశ్చింతగా ఉండవచ్చు.



డా. ఎంఎస్ఎస్ ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

■ నివారణ చాలా సింపుల్... అదే టైమ్‌లో బోలెడంత పవర్‌ఫుల్...

నిజానికి గుండెజబ్బుల నివారణ చాలా చాలా సింపుల్. మనం సంకల్పంతో నిలిపేయగలిగే పొగతాగే అలవాటు, మద్యం అలవాట్లనుంచి దూరంగా ఉంటే చాలు. అదే సమయంలో అన్నంలో తగినన్ని ఆకుకూరలూ, కాయగూరలతో పాటు తాజా పండ్లు తీసుకోవడం వంటి మంచి రుచికరమైన మార్గంలో వెళ్లడం ద్వారా గుండెజబ్బుల్ని సమర్థంగా నివారించవచ్చు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవడం, బరువు ఆరోగ్యకరమైన లిమిట్‌లోనే ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యమైనవి. ఇక్కడ కాస్తంత కష్టమైనదైనా కన్సిస్టెంట్‌గా అంటే క్రమం తప్పకుండా పై అలవాట్లను కొనసాగించడంతో గుండె ఆరోగ్యాన్ని పదికాలాలపాటు పదిలంగా పదిలపరచవచ్చు.

■ గాలినీ, కలుషితాలనూ తేలిగ్గా తీసుకోకండి...

మనం పీల్చే గాలి శుభ్రంగా ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యమే. అంటే... వాహనాల పొగతో లేదా కాలుష్యంతో కూడిన గాలిని పీల్చుకోవడాన్ని వీలైనంతగా తప్పించుకోవాలి. వాటిలో ఉండే కాలుష్యపదార్థాలు, ధూళిదూసరాలూ రక్తనాళాల్లో రక్తప్రవాహాన్ని వేగవంతం చేస్తాయి. అలా గుండెజబ్బులూ వేగంగా వచ్చేలా చేస్తాయి. కాలుష్యం పెరిగిన కొద్దీ రక్తం తాలూకు ఎరుపు రంగు డేంజర్ మార్క్‌లా కనిపిస్తుంది. అదే వీలైనంతగా పచ్చటి పరిసరాల్లోనే ఉండటం ప్రారంభిస్తే గుండె ఆరోగ్యమూ పదికాలాలు పచ్చగా ఉంటుంది.

DON'T MISS A BEAT — రేపు వరల్డ్ హార్ట్ డే

■ మహిళల గుండెలకు మరింత ముప్పు...

మహిళలు కుటుంబ ఆరోగ్యానికి ప్రాధమ్యం ఇచ్చి, చాలావరకు తమ ఆరోగ్యానికి రెండో ప్రాధాన్యమిస్తారు. వారు తమలో కలిగే అలసటను ఇంటి పనులతో వచ్చిన నీరసంగా అనుకుంటారు. తమ అజీర్ణ సమస్యను గ్యాస్ సమస్యగా భావిస్తారు. తమ గుండెనొప్పిని ఛాతీనొప్పిగానే తీసుకుంటారు. ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగున్నట్టుగా వాళ్ల గుండె బాగుంటేనే మిగతా ఇంటి సభ్యుల గుండె సంస్పందనలూ బాగుంటాయి. 'డోంట్ మిస్ ద బీట్' అనే థీమ్‌ను తమకు అనువుగా ఆలోచిస్తే.. మహిళలకే అది ఎక్కువగా అనువర్తిస్తుంది.

■ అనుక్షణం... రక్షణకు అనువైన క్షణమే...


ఆకస్మిక గుండె జబ్బు ముప్పు నుంచి కాపాడాలంటే అనుక్షణం అనువైన క్షణమే. అందుకే గుండెజబ్బు లక్షణాలు కనిపించినప్పుడు దాన్నుంచి రక్షించాలంటే ప్రతి ఒక్కరూ కార్డియాక్ పల్మనరీ రిససియేషన్ అనే సీపీఆర్ గురించి అవగాహన పెంచుకోవాలి. ఎవరైనా గుండె పట్టుకుని కుప్పకూలిపోతే ఒకచేతి వేళలలో మరో చేతి వేళ్లు దూర్చి క్షణం కూడా ఆలస్యం చేయకుండా గుండెపై క్రమబద్ధంగా, లయబద్ధంగా, నేర్పుగా కదిలిస్తూ 'సీపీఆర్' నిర్వహించే నైపుణ్యాలను నేర్చుకోవాలి. అది ఇల్లూ, వాకిలీ, పనిప్రదేశం ఇలా ఎక్కడైనా, ఎవరైనా అభ్యసించగల సింపుల్‌గా చేయగలిగే ఈ ప్రాణరక్షణ నైపుణ్యం చేతుల్లో దాగి ఉండే అభయహస్తాలవుతాయవి.

■ చివరగా...

మనం పుట్టిన నాటి నుంచీ క్షణం కూడా ఆగకుండా... ఒక్క బీట్ కూడా మిస్ కాకుండా ఒక జీవితకాలం పాటు సంస్పదిస్తూ ఉండే ఆ గుండెను గౌరవిస్తూ... దాన్ని మాటువేసి కాటు వేసే అన్ని రకాల అవాంతరాల నుంచి కాపాడుకోడానికి బిక్కు బిక్కుమని భయపడకుండా ఉండటానికి గడియారంలో టిక్కు టిక్కుమనే ఏ బీట్‌నూ మిస్ కాకుడదంటూ లబ్‌డబ్ మంటూ స్పందించే 'హార్ట్' డే థీమ్‌కు భాష్యం చెప్పుకోవాలి.

హెల్త్

నిర్వహణ: యాసీన్



యంగ్ ఇండియా! బీ(ట్) కేర్‌ఫుల్

ప్రపంచవ్యాప్తంగా గుండెజబ్బులు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అందునా ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ తన విశృంఖల ప్రతాపం చూపాక గుండెజబ్బుల కేసులు మరింత ఎక్కువయ్యాయి. అందుకే ప్రతి ఏడాదీ సెప్టెంబరు 29న నిర్వహించే వరల్డ్ హార్ట్ డే తాలూకు థీమ్ ఏమిటంటే... "ఒక్క స్పందననూ మిస్ కావద్దు" (డోంట్ మిస్ ఏ బీట్). దీని అర్థం ఏమిటంటే... ఒక్క గుండె కూడా తన స్పందనలను కోల్పోయే పరిస్థితి రాకూడదనే. గతంలో కనీసం 50, 40లలో కనిపించే ఈ గుండెజబ్బులు ఇప్పుడు ఎందుకిలా యుక్తవయసులోనే వచ్చేస్తున్నాయో చెప్పే కారణాలూ, వాటిని నివారిస్తూ మన యువతను గుండెజబ్బుల నుంచి రక్షించుకునేందుకు తగిన అవగాహనను కల్పించేందుకే ఈ కథనం.

లబ్... డబ్... లయ తప్పొద్దు!

గుండెజబ్బుల తీవ్రతనూ, విస్తృతినీ తెలిపే కొన్ని గణాంకాలను చూద్దాం. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్‌లలోని కొన్ని పెద్ద హాస్పిటల్స్ తాలూకు ఎమర్జెన్సీ కేసులను పరిశీలిస్తే సగానికి పైగా కేసులు... అంటే 50% కేసుల్లో బాధితులు కేవలం 40 ఏళ్లలోపు వాళ్లే. మానసిక ఒత్తిడి, ఎటూ కదలకుండా (శారీరక శ్రమ లేకుండా) ఉండే వృత్తులూ పెరగడంతో గుండె జబ్బులతో బాధపడే యువత కూడా పెరుగుతోంది. అందుకే ఇటీవల కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ 45 ఏళ్ల లోపే అక్యూట్ కరోనరీ సిండ్రోమ్‌తో బాధపడేవారిపై పరిశోధనల కోసం ఓ అధ్యయన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇటీవలి పరిశీలనల ప్రకారం ప్రతి ఐదు గుండెపోటు కేసులను పరిశీలిస్తే అందులో ఒకరు తప్పనిసరిగా 40 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. గుండెజబ్బుల పరంగా ప్రపంచవ్యాప్తంగా 20 - 30 ఏళ్ల యువతలో ఏడాదికి 2% పెరుగుదల ఉండగా... మన దేశంలో సైతం గుండెజబ్బులకు లోనైన వాళ్లలో 40 ఏళ్ల లోపు వారు కనీసం 25% వరకు ఉండటం మరింతగా బెంబేలెత్తిస్తున్న అంశం. హైబీపీ, హైకొలెస్ట్రాల్ వంటివి యువతలో పెరుగుతుండటమే దీనికి కారణం. దాంతో క్రమంగా, నిశ్శబ్దంగా చాపకింద నీరులా గుండెజబ్బుల కేసులు భారత్‌లోనూ పెరుగుతున్నాయి.

లక్షణాలు... సాధారణంగా చాలామందిలో ఛాతీనొప్పితో గుండెపోటు కనిపిస్తుంది. ఈ లక్షణం కనిపించే వారు 97.3 శాతం మంది, చెమటలు పట్టడం 11 శాతం మందిలో, వాంతులు లేదా వికారం 8.2 శాతం కేసుల్లో, శ్వాస ఆడకపోవడం 6.8 శాతం మందిలో కనిపిస్తాయి. ఈ వయసులో చాలా మందిలో వచ్చే గుండెపోటుకు కారణమైన నొప్పిని గ్యాస్, అజీర్ణం, అసిడిటీ కారణంగా భావిస్తుంటారు. ఈ అంశం కూడా చికిత్స ప్రారంభించడాన్ని ఆలస్యం చేస్తోంది.

నివారణ ఇలా... కార్డియో వాస్క్యులార్ హెల్త్ స్కోరుకు దగ్గరగా ఉండే జీవనశైలి: సాధారణంగా పాశ్చాత్యదేశాల్లో... మరీ ముఖ్యంగా అమెరికా వంటి చోట్ల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ నిర్దేశించిన కొన్ని జీవనశైలి మార్గదర్శకాలు ఉన్నాయి. వాటినే 'లైఫ్ ఎసెన్షియల్స్ 8 (ఎల్‌ఈ 8); లైఫ్ ఎసెన్షియల్స్ 7 (ఎల్‌ఈ 7)గా వ్యవహరిస్తుంటారు. అంటే... ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా అనుసరించే మార్గదర్శకాలైన... రక్తపోటును (హైబీపీని) అదుపులో ఉంచుకోవడం; రక్తంలో చక్కెరమోతాదులనూ, కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడం; ఆరోగ్యకరమైన ఆహారాన్ని, పోషకాహారాన్ని తీసుకోవడం; తగినంత వ్యాయామం చేయడం; ఎత్తుకు తగినంత బరువు ఉండేలా బాడీ మాస్ ఇండెక్స్- (బీఎమ్ఐ)ను మెయింటెయిన్ చేయడం; స్మోకింగ్ / నికోటిన్‌కు దూరంగా ఉండటం; కంటినిండా నిద్రపోవడం... అలాంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడం ద్వారా ఈ లైఫ్ ఎసెన్షియల్ స్కోరును ఎంతగా పెంచుకుంటే గుండెజబ్బులను అంతగా నివారించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ● **అర్లీ వార్నింగ్ సిగ్నల్స్ ద్వారా :** చాలామందిలో గుండెజబ్బులుగానీ లేదా గుండెపోటుగానీ ఆకస్మికంగా రాకముందే కొన్ని వార్నింగ్ సిగ్నల్స్ పంపుతాయి. ఉదాహరణకు ఛాతీలో ఇబ్బందిగా ఉండటం, తీవ్రమైన నీరసం, నిస్సత్తువ, అలసట, గుండెదడ (పాల్పిటేషన్) వంటివి. వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో గుర్తించి డాక్టర్లను సంప్రదించడం వల్ల. ● **స్క్రీనింగ్ పరీక్షలతో :** హైబీపీ, అధిక కొలెస్ట్రాల్, మధుమేహంతో బాధపడేవారు తగిన పరీక్షలు చేయించుకోవడం, ఏవైనా లక్షణాలు కనిపిస్తే కరోనరీ సీటీ యాంజియోగ్రామ్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండెజబ్బులు నివారించవచ్చు.



డాక్టర్ అంజని ద్వారంపూడి
సీనియర్ కార్డియాలజిస్ట్

గుండె జబ్బుల పెరుగుదలకు కారణాలు...

● **వయసు పెరుగుతుండటం:** ఇది నివారించలేని అంశం. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ మృదువుగా ఉండాల్సిన రక్తనాళాలు గట్టిబారుతుంటాయి. దీన్నే అథెరోస్క్లిరోసిస్ అంటారు. గతంలో సాధారణంగా 40 ఏళ్లకు పైబడ్డాక ఈ పరిణామం సంభవిస్తుండేది. ఇప్పుడు ఈ వయసు కంటే ముందే.. అంటే 20 నుంచి 30 ఏళ్లలోపే ఇలా రక్తనాళాలు గట్టిబారడం కనిపిస్తోంది. కొందరిలో కొలెస్ట్రాల్ నిల్వలు చాలా నెమ్మదిగా రక్తనాళాల్లోకి చేరుతుంటాయి. కానీ కొందరిలో చాలా వేగంగా ఈ ప్రక్రియ జరుగుతుంది. ఇలా పేరుకునే కొవ్వును 'ప్లాక్'గా వ్యవహరిస్తుంటారు. ఈ ప్లాక్ రక్తనాళాల్లోకి ఎక్కువగా చేరడం వల్ల ధమనులు/రక్తనాళాలు సన్నబడి, గుండె కండరాలకు రక్తప్రసరణ తగ్గిపోతుంది. ఈ ప్లాక్ ఎక్కువగా చీలిపోయి క్లాట్స్ (అడ్డంకులు)గా మారి ఆకస్మికంగా గుండెకు రక్తసరఫరా తగ్గవచ్చు. ఫలితంగా గుండెపోటు రావచ్చు.

● **ఆహారపు అలవాట్లు:** హైలీ ప్రాసెస్‌డ్ ఫుడ్ తీసుకోవడం వంటి మారుతున్న ఆహారపు అలవాట్లు, ఉప్పు, చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు చిన్న వయసులోనే గుండెజబ్బులు / గుండెపోటుకు దారితీసే ముప్పును పెంచుతున్నాయి. మన దేశంలో దిగువ, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ఉండే దేశాల్లో పెరుగుతున్న పట్టణీకరణ / నగరీకరణ కారణంగా అన్ని పోషకాలు ఉండే మంచి ఆహారంతో పోలిస్తే అధిక క్యాలరీలు ఉండే ఆహారం చవగ్గా దొరుకుతుండటంతో గుండెజబ్బుల ముప్పు పెరుగుతోంది.

● **తగినంత వ్యాయామం లేకపోవడం :** కుదురుగా కూర్చుని చేసే వృత్తులు పెరగడం ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అంశమే అయినప్పటికీ... మన దేశ యువతలో కూడా వ్యాయామం లేకపోవడమూ, పైగా మన దేశ సాంస్కృతిక, సామాజిక నేపథ్యం కారణంగా మహిళలు, అమ్మాయిల్లో వ్యాయామ సంస్కృతి తక్కువగా ఉండటం కూడా గుండెజబ్బులు / గుండెపోటు ముప్పునకు కారణమవుతోంది.

● **పొగతాగడం :** ఇటీవల భారత్, రష్యా, కొన్ని మధ్య ఆసియా దేశాల్లో పొగాకు వినియోగం బాగా పెరుగుతుండటం అథెరోస్క్లిరోసిస్‌కూ, గుండెపోటుకు మరో ప్రధాన కారణం. 60 ఏళ్ల వ్యక్తులతో పోలిస్తే 40 ఏళ్లలోపు వారికి పొగ దుష్ప్రభావం మరింత ఎక్కువ. అయితే ఏ వయసులోనైనా పొగతాగడం అంతే ప్రమాదకరం అని గుర్తించాలి.

● **స్థూలకాయం కారణంగా :** మన దేశవాసుల్లో ఊబకాయం ఎక్కువగా పొట్ట దగ్గర వస్తుంది. దీన్నే అబ్డామినల్ ఒబేసిటీ అంటారు. మన జీవనశైలి (లైఫ్ స్టైల్) కారణంగా ఇలా స్థూలకాయం రావడం, పొట్ట దగ్గర కొవ్వు పెరగడం కూడా గుండెజబ్బుల ముప్పును మరింత పెరిగేలా చేస్తోంది.

● **హైబీపీ, డయాబెటిస్ :** లైఫ్‌స్టైల్ జబ్బులైన హైబీపీ, డయాబెటిస్ వంటి అనారోగ్యాల విషయంలో అవగాహన అంతగా లేని మన లాంటి దేశాలలో నియంత్రణలో లేని హైబీపీ, మధుమేహం వంటివి గుండెపోటుకు కారణమవుతున్నాయి.

● **జెండర్ అంశం :** ఒక వయసు వరకు మహిళలతో పోలిస్తే గుండెపోటు వచ్చే అవకాశాలు పురుషుల్లో ఎక్కువ. రుతుస్రావం ఆగిపోయే వరకు మహిళల్లోని ఈస్ట్రోజెన్ వారికి ఒక రక్షణ కవచంగా ఉంటుంది. అయితే రుతుక్రమం ఆగాక మహిళలతో పాటు... ఏ జెండర్ వారికైనా గుండెపోటు అవకాశాలు సమానం.

● **సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు:** పై అంశాలకు తోడుగా ఒక సమాజంలోని విద్య, ఆదాయ వనరులు, ఆరోగ్య సంరక్షణకు గల అవకాశాలు, సాంస్కృతిక నేపథ్యాల వంటి అంశాలు కూడా గుండెజబ్బుల కేసులను ప్రభావితం చేస్తుంటాయి.

● **ఫ్యామిలీ హిస్టరీ :** మిగతావారితో పోలిస్తే గుండెజబ్బులు / గుండెపోటు లాంటివి వచ్చిన వారి కుటుంబాల తాలూకు కుటుంబ ఆరోగ్య చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) కూడా గుండెజబ్బుల ముప్పునకు ఒక ప్రధాన కారణం. మిగతావాళ్లతో పోలిస్తే దాదాపు 25 శాతం మంది రోగుల్లో గుండెపోటుకు ఈ ఫ్యామిలీ హిస్టరీనే కీలకాంశమవుతుంది.

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసిచూడు.. అని సామెత. రెండూ జటిలమైనవేనని అర్థం. ఇంటి కోసం అప్పు చేసినా తప్పు లేదు. అదొక నీడగా మిగులుతుంది. కానీ పెళ్లి? కంపాటబులిటీ కుదిరితే కుటుంబంగా స్థిరపడుతుంది. లేదంటే చేదుజ్ఞాపకంగా వెంటాడుతుంది. అయినా అంతా బాగుంటుందనే ఆశతో ఏడడుగుల ప్రయాణానికి సిద్ధపడినా.. దానికోసం లక్షలకు లక్షలు అప్పు చేయాల్సిన అవసరం ఉందా అని! ఇప్పుడు పెళ్లి ఖర్చును వధూవరులిద్దరే పెట్టుకుంటున్నారు. అది వాళ్లిద్దరి జీవితాలకు తీరని రుణంగా పరిణమించి.. ఈఎమ్ఐల రూపంలో జీతాలనే మింగేస్తోంది. దాని గురించే ఈ కథనం..



● మూడు ముళ్లు... ఆరు వాయిదాలు

E - ఈక్వల్ M - మ్యారేజ్ I - ఇన్‌స్టాల్‌మెంట్

సాత్విక్‌ది మార్కెటింగ్ జాబ్, మానస ఒక కార్పొరేట్ కంపెనీలో లీడ్ రోల్‌లో ఉంది. వీళ్లది పెద్దలు కుదిర్చిన పెళ్లే అయినా, డెస్టినేషన్ వెడ్డింగ్. దాదాపు 80 లక్షల రూపాయలకు పైనే ఖర్చయింది. ఆ భారం ఇరువైపుల తల్లిదండ్రుల మీద పడకుండా వీళ్లిద్దరే షేర్ చేసుకున్నారు. సేవింగ్స్ నుంచేనా ఖర్చు చేసింది అని అడిగితే.. ట్వంటీ పర్సెంట్ సేవింగ్స్, ఎయిటీ పర్సెంట్ లోన్ అనే చెప్పారు ముక్తకంఠంతో. పెళ్లయి మూడేళ్లవుతోంది. ఆ ఖర్చుకు ఇంకా ఈఎమ్ఐ చెల్లిస్తునే ఉన్నారు. ఆ లోన్ తీరేదాకా పిల్లలు వద్దు అనుకుంటున్నారట. ఆ మాటతో మానస వాళ్ల మామ్మ హతాశురాలైంది. ఇదెక్కడి చోద్యమంటూ విచారపడింది.

> మన మ్యారేజ్ ఇండస్ట్రీ ఏటా కోటి పెళ్లిళ్లతో 10.79 లక్షల కోట్ల టర్నోవర్‌గా పురోగమిస్తోంది. ఫుడ్ అండ్ గ్రాసరీ తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధాన, ప్రభావవంతమైన ఇండస్ట్రీగా విరాజిల్లుతోంది.

సర్వేలే సాక్ష్యం

'ఇండియా లెండ్స్' చేసిన సర్వే మేరకు సొంత ఖర్చుతోనే పెళ్లిచేసుకోవాలనుకుంటున్న 26 శాతం అమ్మాయిలు, అబ్బాయిలు.. ఆ ఖర్చును పర్సనల్ లోన్‌తో భర్తీ చేసుకుంటున్నారట. వాళ్లలో చాలామంది పెళ్లికి సంబంధించి ఒక్క ఈవెంట్‌కే రూ. లక్ష నుంచి రూ. అయిదు లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. దీని మీదే వెడ్డింగ్‌వైర్ ఇండియా అనే సంస్థ చేసిన అధ్యయనంలో ఒక్క నిరుడే మన దేశంలో పెళ్లి ఖర్చు అమాంతం రూ. 29.6 లక్షలకు చేరినట్టు తేలింది. పెళ్లి జంటల్లోని మూడోవంతు జంటలు తమ పెళ్లికి రూ. 30 లక్షలకు పైనే వెచ్చిస్తుంటే మిగిలిన జంటలు రూ. 50 లక్షలకు పైగా ఖర్చుపెడుతున్నారని ఆ సర్వే నివేదిక.

అప్పులు బారెడు... జీతం మూరెడుగానే!

డబ్బు ఖర్చు పెట్టడం చాలా ఈజీ. కూడబెట్టడమే బహు కష్టం. రూ. లక్ష సమకూర్చుకోవడానికైనా కనీసం ఏడాది పడుతుంది. అలాంటిది మూడు లేదా అయిదురోజుల పెళ్లిలోని ఒక్కో వేడుకకు రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల దాకా పెట్టే ఖర్చు జీవితానికి ఎంత భారమవుతుందో తెలుసా! ఆ అప్పు తీర్చడానికి ఆ జంటలు.. అప్పుడే పిల్లల్ని వద్దనుకోవడం దగ్గర్నుంచి ఇల్లు, ఇతర స్థిర, చరాస్తులను సమకూర్చుకోవడం దాకా అన్నిటినీ వాయిదా వేసుకుంటున్నారు. అపార్ట్‌మెంట్ డౌన్‌పేమెంట్‌కి పనికొచ్చే డబ్బును, భవిష్యత్ ప్రణాళికలను.. ఆఖరకు ఇన్సూరెన్స్ పాలసీలను సైతం బ్రేక్ చేసి మరీ పెళ్లి బట్టలు, ఈవెంట్ డెకరేషన్ కోసం చేసిన అప్పు తీరుస్తున్న జంటలున్నాయి. ఇలా ఆ లోన్ వాళ్ల పెళ్లిని మధుర జ్ఞాపకంగా మలచకపోగా సంసారాన్ని చింతల చితిగా మారుస్తోంది.

క్రైసిస్‌లో కాపురాలు

దరఖాస్తుదారుల క్రెడిట్ స్కోర్‌ను బట్టి వెడ్డింగ్ లోన్స్, పర్సనల్ లోన్స్ ఏడాదికి పది నుంచి 24 శాతం దాకా మంజూరవుతున్నాయట. వీటికి కట్టలేకుండా పేరుకుపోయిన ఈఎమ్ఐల వడ్డీ వచ్చి చేరి.. ఎంత జీతం వచ్చినా, అత్యవసరాలకే ఎసరు వస్తోంది. ఈ క్రైసిస్ కాపురంలో కలతలను రేపుతోందంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్లు. పెరుగుతున్న రుణభారాన్ని తీర్చడానికి ఓవర్ టైమ్, పార్ట్‌టైమ్ జాబ్‌ల కోసం వెదుక్కుంటున్న జంటలూ ఉన్నాయి. నెల తిరిగేసరికల్లా వచ్చే ఈ ఈఎంఐల ఒత్తిడి తట్టుకోలేక భార్యాభర్తల డైనింగ్ టేబుల్ కాన్వర్జేషన్స్ కలహాలతో ముగుస్తున్నాయి. ఎడమొహం పెడమొహంగా ఉదయాలు మొదలవుతున్నాయి.

అప్పు తప్పు కాదు కానీ..

లోన్ తీసుకోవడంలో తప్పులేదు. కానీ ఎందుకు తీసుకుంటున్నాం.. దేనిమీద ఖర్చు పెడుతున్నామనే ఎరుక, స్పష్టత చాలా అవసరం అంటున్నారు ఆర్థికవిశ్లేషకులు. ఇల్లు కట్టుకోవడానికో, వ్యాపారం ప్రారంభించడానికో, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే చదువుకోసమో అప్పు చేయడం సబబే. కానీ.. పైసా రాబడి లేనిచోట అప్పు చేసి మరీ డబ్బును వెదజల్లడం తెలివైన నిర్ణయం కాదని చెబుతున్నారు. పరస్పర గౌరవ మర్యాదలు, సర్దుబాట్లు, ప్రేమాభిమానాలతో పెళ్లి చేసుకోవాలి. మంచి కుటుంబంగా స్థిరపడాలి. కానీ ఆడంబరాల వేడుకగా.. ఫొటోలు, వీడియోలతో కనిపించే అప్పుగా కాదని సూస్తున్నారు ఆర్థికనిపుణులు, విశ్లేషకులు, ఫ్యామిలీ కౌన్సెలర్లు. కలలు సాకారమవ్వాల్సిందే! మధురమైన జ్ఞాపకాలను క్రియేట్ చేసుకోవాల్సిందే! కానీ ఈ రెంటికి మూల్యం మన జీవితం కాకూడదు! అప్పుడే సాకారమైన కలలు మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

దేశవ్యాప్తంగా ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తూ టెంపుల్ డ్యాన్సర్‌గా పేరుతెచ్చుకుంది విజయవాడవాసి కూచిపూడి నృత్యకారిణి కావ్య కంచర్ల. దసరా నవరాత్రుల సందర్భంగా తన విద్యార్థులతో కలిసి అమ్మవారి రూపాలను వివిధ ఆలయాలలో నృత్యరూపకాలుగా ప్రదర్శిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే కేరళ తరంగ్‌లో పాల్గొని విజేతగా నిలిచారు. గిన్నిస్‌బుక్ రికార్డ్‌లోనూ చోటు సంపాదించారు. నృత్యం ద్వారా తమ శక్తిని ఎలా ప్రదర్శిస్తారో ఈ సందర్భంగా వివరించారు.



నృత్యార్చనం

నవశక్తి

"దసరా నవరాత్రులలో అంతటా అమ్మవారే కనిపిస్తుంటారు. ఇక విజయవాడలోనే కొలువైన అమ్మవారికి చేరువలో ఉంటూ నృత్యం ద్వారా సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడ ఉన్న వివిధ ఆలయాలకు ముందుగానే అప్లికేషన్స్ ఇచ్చాం. వారు ఇచ్చిన టైమ్ ప్రకారం నృత్యం ప్రదర్శనలు ఇస్తున్నాం.

అలసట తెలియదు

నవరాత్రుల మొదటి రోజు నుంచి ఈ రోజు వరకు ఆరు ప్రదర్శనలు ఇచ్చాం. అమ్మవారి మీద ఎన్నో గీతాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో గీతాన్ని ఒక్కో ఆలయంలో మాకు ఇచ్చిన సమయం వరకు ప్రదర్శన ఇస్తున్నాం. పూర్తయ్యాక పెద్ద వయసున్నవారు కూడా ఏమాత్రం సంకోచించకుండా మమ్మల్ని కలిసి 'ఆ అమ్మవారే నృత్యం చేస్తున్నారా అనే భావన కలిగింది' అని చెప్పినప్పుడు కలిగే ఆనందం మాటల్లో వర్ణించలేనిది. ఒక తొంభైఏళ్ల బామ్మగారు ప్రదర్శన పూర్తయ్యాక వచ్చి తన చిన్నప్పుడు నేర్చుకున్న ఆలాపన ఇప్పుడు గుర్తుకు వచ్చిందని భావయుక్తంగా పాడి వినిపించారు. 'ఆ అమ్మవారు ఈ రూపంలో నాకు కనిపించారు' అని పొంగిపోయారు. ఇలాంటి ఎన్నో అనుభూతులను ప్రతిసారీ మేం పొందుతుంటాం. మా దగ్గర నృత్యం నేర్చుకునే విద్యార్థులు కూడా 'అమ్మవారి నృత్యంలో అలసట ఎందుకు రాదు' అని అడుగుతుంటారు. నృత్యం ఒక యాక్టివిటీ కాదు దైవికంగా ఎంత దగ్గరవుతుంటామో ఈ నృత్యం మాకు స్పష్టం చేస్తుంటుంది. విజయవాడ అంటేనే అమ్మవారు. దసరానవరాత్రుల్లో ఆలయాల్లో మేం నృత్యం చేయడం అంటే అమ్మకు దగ్గరగా ఉన్నట్టే. ఒక భక్తి పూర్వక ప్రార్థన. మా నృత్యాన్ని అమ్మ చూస్తుంది అనే భావనతోనే చేస్తాం. 'ఎంతోసేపు నృత్యం చేసినా అలసటగా ఎందుకు అనిపించడం లేదు?' అని మా విద్యార్థులు అడుగుతుంటారు. ఆధ్యాత్మికంగా అమ్మవారికి దగ్గరగా ఉంటే మరేమీ తెలియదు.

అమ్మవారి ప్రతి రూపం మనకు ప్రేరణ ఇచ్చే పాఠమే. మన జీవన విధానానికి ఎంతగానో తోడ్పడేదే. ఆ శక్తిని మేం నృత్యం ద్వారా ప్రదర్శించడమే కాదు మేమూ పొందుతుంటాం. సేవ చేస్తున్న కొద్దీ శక్తి పెరిగేదే. శ్రీశైలం, తిరుపతి, శిరిడీ, మహానంది, భద్రాచలం, హరిద్వార్, కేదార్‌నాద్, బదిరీనాద్... ఇలా మనదేశంలోని ప్రముఖ దేవాలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చే అవకాశం లభించింది. వందల, వేల మంది ముందు ప్రదర్శనలు ఇస్తుంటాం కాబట్టి ధైర్యం పెరుగుతుంది. మధురమైన మాటతీరు, ఏకాగ్రత.. ఇలా ఎన్నో పాజిటివ్ అంశాలు పెరుగుతాయి. రోజూ సాధన చేయడం వల్ల శారీరక ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ఆనందం కలుగుతుంది. వీటన్నింటి వల్ల జీవనశైలి కూడా బాగుంటుంది.

బీఎస్సీ కంప్యూటర్స్‌లో డిగ్రీ, నృత్యంలో డిప్లొమా చేశాను. మా అమ్మ మాధవికి కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం. నాలుగేళ్ల వయసు నుంచి నాకు నృత్యం నేర్పించారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శనలు ఇస్తున్నాను. అకాడమీ పెట్టి, నృత్యసేవను కొనసాగిస్తూ ఉండాలని మా నాన్న కల. నాన్న వెంకట రత్నకుమార్ కరోనాలో మాకు దూరమయ్యారు. నాన్న కలను నెరవేర్చడానికి 'పంచమవేద' అకాడమీ ద్వారా కృషి చేస్తున్నాను. జాతీయ స్థాయి నృత్య పోటీ అయిన కేరళ తరంగ్‌లో పాల్గొన్ని విజేతగా నిలిచాను. ఇప్పటి వరకు 1500 కు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. గ్రూప్‌గా చేసిన శతనృత్య యాగంలో పాల్గొనే అవకాశం రావడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ లో చోటు దక్కింది. ఎంతో సాధన చేస్తూ శక్తిని పెంచుకోవడానికే ఈ నృత్య సేవ చేస్తున్నాను' అని వివరించారు ఈ నృత్యకారిణి.

– **నిర్మలారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి